# ఆఫీసులో అల్లరి

గుమాస్తా, బంట్రోతూ తప్ప అందరూ వెళ్లిపోయారు. దొర ఏడుగంటల దాకా పోడు. అంచేత గుమాస్తా యేడున్నరదాకా పడి వుండాలిసొస్తున్నది. ఓవర్‌టైమ్! ఎందుకో తెలీదు. ఏడుగంటలదాకా గుమాస్తాలందర్నీ పడేసి అట్టే దొరగారి అంతరాత్మ తృప్తిపడుతుంది. అప్పుడు గాని ఆయన ప్రాణానికి యుద్ధ ప్రయత్నం సరిగా సాగుతున్నట్టు తోచదు. నిజంగా ఆఫీసులో చెప్పుకోదగ్గ పనిలేదు. బయటికి వెళ్లే ఉత్తరాల్లో మూడొంతులు అనవసరం. పైనించి వచ్చేవీ అంతే. బోలెడంతమంది గుమాస్తాలు. సగం మందికి పనిలో ఆసక్తిలేదు. పనిరాదు. పనిచెయ్యరు. పొట్టగడవక వచ్చారు. ఉద్యోగం దొరికిన తరవాత పొట్టమాట మరిచిపోయి రేపటి సంగతి జ్ఞాపకం రాకుండా ఉండగలందుకు అడ్డమైన సొళ్లు కబుర్లూ చెప్పుకుంటారు. దొరగారు బయటికెళ్లగానే అంతా జారుకుంటారు - డిస్పాచి - ఫైలింగ్ క్లర్కు తప్ప, వాడికింద తొత్తు బంట్రోతు.

కాలక్రమాన వాళ్లవంతూ వచ్చింది. దొరగారు సంతకం చేసిన కాగితం ముక్కలన్నీ ఫైలుచేసి, చెయ్యనివి బొత్తిగా టేబిలుమీద పెట్టి, కలాలూ పెనసళ్లూ తీర్చిపెట్టి, ఆయన బల్ల మీద జరగవలసిన మిగిలిన సద్దుడు బంట్రోతుకు వదిలి, డ్రాయర్లన్నీ తాళాలువేసి గుమాస్తా కాస్తా ఇంటిదారి పట్టాడు. మరో అయిదు నిమిషాలకి బంట్రోతు కూడా కాళ్లీడ్చుకుంటూ వెళ్లి పోయినాడు.

ఇక ఆఫీసులో అల్లరి ప్రారంభమైంది.

* * * * *

"ఈ యుద్ధం యెప్పుడైపోతుందోగాని నా ప్రాణం చాలొస్తున్నది" అన్నది టైపు రైటరు.

"మధ్యలో నీకేం వచ్చింది? సంకురమయ్య పోతున్నది మామీదిగా!" అన్నది కాగితాలబొత్తి.

"ఏం వొచ్చిందని అడిగితే యేం చెప్పేది? సంవత్సరం కింద కూడా యింత దిగినా సిల్లి పోలేదు, కాళ్లన్నీ సళ్లు విచ్చిన్నై. ఒంటో జరిఫే లేదు, సరిగా వేళకి ఆయిలింగు

లేదు. నూటికీ కోటికీ అయినా కొత్త రిబ్బను కట్టబెట్టరు, మొన్న మా గుమాస్తా దొరతో కాస్త మరమ్మత్తు చేయిస్తే బాగుంటుందని చెప్పబోయేసరికి, "చాల్లే, యుద్ధం అయేదాకా అటువంటివి తలపెట్టకు!" అన్నాడు దొర. యుద్ధం ఆయేదాకా దక్కుతావా అనుకుంటున్నా!"

"అదే మీ అమెరికనుల తెగులు. అంత అయిష్టంగా యుద్ధంలే నేమని దిగారు? దిగిన తరువాత తీరళ్లా చూడాలిగాని మధ్యలో నసేమిటి?" అన్నది కాగితాల కట్ట.

"మొదలు నువెవరో చెప్పు. నీ మొహం చూస్తే ఆస్ట్రియా మొహంలా ఉంది... ఇంకా నయం అమెరికను శరీరం గనక ఈ బండ చాకిరీ నిలబడి చేస్తున్నాను. ఇదే మా దేశంలో అయితే ఈ అగచాట్లుండవు. మా దేశంలో మా పనివాళ్లని నిక్షేపంలా చూస్తారు. ఇట్లా ఆరు ప్రాణాలూ ఆహరించరు. నువు మొదలిక్కడ యేం చేస్తున్నావో చెప్పు."

"నేను రెఫ్యూజీని. ఎప్పుడో యుద్ధానికి ముందే వచ్చాను. నేను కొందరి కొందరి మాదిరిగా రాత్రింబగళ్లు స్వదేశాన్ని గురించి కలవరించి ఏడుస్తూ కూచోను. నన్ను సగానికి సగం చేశారు. ఒక పక్క కాదు రెండు పక్కలా తలంటుతున్నారు. పావు అంగుళం జాగా కూడా వదలకుండా బరుకుతున్నారు. నేను మాట్లాడానా? యుద్ధ సహకారం చేస్తున్నందుకు నేను గర్విస్తున్నాను."

"సగానికి సగం చేస్తున్నందుకు సంతోషించక పెద్ద త్యాగమల్లే చెప్పుకుంటావేం? అట్లా పొద్దంగా పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నారేమో. ఈనాటి దాకా దక్కావు. లేకపోతే ఏనాడో పెంటకుప్ప మీదికిపోయి అయిపులేకుండా అయిపోయేదానివి. ఈ దిక్కుమాలిన దేశంలో శత్రు ఆస్తికి చూపించే శ్రద్ధ మిత్ర ఆస్తికి చూపిస్తే ఎంతో బాగుండును!"

ఓ చెంప దొరగారి బల్లమీద మరో వాగ్వాదం చెలరేగుతున్నది. దొరగారి పెనసలు లెక్చరు దంచేస్తున్నది.

"... నాఖర్మం ఈనాటికీ ఇట్లా కాలబట్టీ కానీ నేనెప్పుడైనా యీ నాటు మొహాల మధ్య ఈ జైలులో ఉన్నానా? ఈనాటు కలాలూ, వెధవ మొహాలేసుకుని నాటు పాళీలూ, గుండుసూదులకు బదులొచ్చిన యీ తుమ్మముళ్లీ! ఛీ, ఛీ, ఛీ! హాయిగా పాశ్చాత్య నోటు పుస్తకాల వెంబడి, అందమైన కలాలతో పాటు ఉండవలసిన నా బతుకు!"

"మేమూ నీతోబాటు యథాశక్తి యుద్ధ ప్రయత్నం చేస్తున్నామనేది నీకెక్కడా తట్టలేదు. దొరగారి ఆగ్రహానికి పాత్రమై మా పాళీలు ఆర్దాయుస్సు చావులు చస్తున్నై. మేం ఖరీదైన వాళ్లం కామని మమ్మల్ని విరిచి పారెయ్యటమే కాని మేం లేకుండా పని జరగదనీ, మా స్థానం ఆక్రమించవలసింది మా వంటి వాళ్లేననీ దొరగారికి తట్టదాయె... దొరగారికి నీమీద ఉండే ప్రేమలో మామీద నూరోవంతు లేదు. నువు కనిపించకపోతే గుమాస్తాలందరిమీదా లేస్తారు. మేం కనిపించకపోతే ఆయనకే చింతా లేదు. అసలు

మొహాలే ఆయనకు స్పష్టంగా తెలీవు! ఎన్నిసార్లు ఎర్రకలాన్ని నల్లసిరాలోనూ, నల్లకలాన్ని ఎర్రసిరాలోనూ ముంచలేదు. సిరాలు కూడా ఖరాబయి కూచున్నై. ఆయనకి కోపం వచ్చినప్పుడు "బుడ్లు రెండూ బయట వొంచి, కడిగి మళ్లా నింపు" అంటారు మా తప్పువల్లే సిరాలు చెడిపోయినట్లు. పాశ్చాత్య వస్తువులే ఉండాలని పట్టుబట్టుకుంటే పనిగడవదని గుర్తించి మా నాటు సిరాలు ఆమోదించినందువల్ల కలిగిన కాస్త లాభమూ నాలుగు రోజులకోసారి సిరాలు ఒంచెయ్యటంలో గూబల్లోకి తీస్తున్నది!.... నాటు సిరా ఎంత పారబోసినా దానికి విలవ ఏమీ లేదనే కదూ?" అన్నది కలం.

"నాకో సంగతి తెలీకుండా ఉంది; ఈ విదేశీ వస్తువులు ఇంత ప్రియం కావటానికి కారణం ఏమిటి? మన వస్తువులకు విలవే లేకపోవటమేమిటి?" అన్నది పేపరు వెయిటు.

"నీకు తెలీదా ఏమిటి? వాళ్ల దేశాల్లో ఈ వస్తువులకీ విలువలేదు. కాని దారిలో నీటిమీద ఎగుమతి దిగుమతి సుంకాలు పడి ఖరీదు బలిసి చాలా ప్రియతమంగా తయారవుతై" అన్నది పిన్‌కుషన్.

"నువు కూడా ఈనాటికొక దేశభక్తుడివైనావులే. మొన్న మొన్నటిదాకా విదేశీ గుండు సూదుల వొంటో గుచ్చుకుని కులుకుతూ తిరిగి, వాటిని తప్ప మొయ్యక, ఇవాళ నాటు ముళ్లు రాగానే బోడి మొహం వేసుకుని కూచోటానికైనా వొప్పుకుని మమ్మల్ని స్వీకరించని దానివి!" అన్నది తుమ్మముల్లు.

"అట్లా అనటం ధర్మమా? విధి బలవత్తరమైతే నేనేం చెయ్యను? అవును, పై వాళ్లని మోశాను, వాళ్లని పెట్టుకొని కులికాను కూడానూ! సరేనా? ఇప్పుడు మిమ్మల్ని మొయ్యనన్నానా? నన్ను గురించి పై వాళ్లకి అపోహలున్నై, నేను విదేశీ సరుకుతప్ప మొయ్యనని. దానికి నేనేం చెయ్యను. బొత్తిగా అసహాయ స్థితిలో ఉన్నాను!" అని మొర పెట్టుకుంది పిన్ కుషన్.

"ఏడవకు పిన్ కుషనూ! ఎల్లకాలం ఇట్లాగే ఉంటామా? మనకి మాత్రం మంచి రోజులు రావా? దేవుడు మేలు చేస్తే మన దేశంలో మటుకు నిన్నలంకరించే గుండుసూదులు తయారు కాక పోతాయా?" అన్నది సిరాబుడ్డి.

దొరగారి పెన్సలు పెద్ద పెట్టుగా నవ్వింది. "పిచ్చివాళ్లల్లారా! మీ అమాయకత్వం చూస్తే నాకు జాలేస్తున్నది. మీకీ విధంగా మాట్లాడుకునే అవకాశమైనా ఇచ్చింది ఈ యుద్ధం. దీని మూలంగా మీకు దొరగారి టేబిలు మీద స్థానం దొరికేటప్పటికి, మాకన్న పూర్వం ఇక్కడ ఉంటూ వచ్చిన వాళ్లని చూసి యాడవటం మొదలుపెట్టారు. రేపీ యుద్ధం అయిపోతుంది. మీ నికృష్ట స్థానాలకు మీరు పోతారు. దొరగారి టేబిలు మీద అందమైన

విదేశీ ఊటకలాలూ, పెనసళ్లూ, సిరాబుడ్లూ, అద్దుడు కాగితాలూ వచ్చేస్తై. మీమీ స్థానాలకు తిరిగిపోయి మీ అజ్ఞాత జీవితాలు మీరు గడుపుతారు!" అన్నది పెనసలు.

"తమ్ముడూ, నువొక చిన్న పొరపాటు పడుతున్నావు!" అన్నది దొరగాలి కుర్చీ "ఈ యుద్ధం ఎందుకు జరుగుతున్నదో నీకు సరీగా తెలీలేదు. అందుచేతనే యుద్ధం గురించి దాదాపు పశ్చాత్తాపం కనబరుస్తూ మాట్లాడావు – ఇది మాబోటి నాటు వస్తువుల అజ్ఞాతవాసాన్ని అంతం చెయ్యటానికీ అని మాకు తెలుసును. నేను దొరగార్ని మోస్తున్నానే అని విచారించటం లేదు. ఆయన ద్వారా యుద్ధం సాగుతున్నది. నేను సంతోషంగా మోస్తాను. మధ్య మధ్య ఏమరినప్పటికీ మొత్తం మీద దొరగారికి మీ నిజమైన న్యాయమైన స్థానం తెలియబట్టే మీకీ బల్లమీద స్థానం తక్షణం ఇచ్చేశారు. అది కేవలమూ విధిలేక చేసిన పనికాదు. ఆ అంతరార్థం నీకేం తెలుస్తుంది దొరగారి డయరీలో టెలిఫోను నంబర్లూ అవీ గీకేదానివి!... ఓ వేళ నువు చెప్పినట్టే యుద్ధం అయిపోగానే మీ అందరికీ మళ్లా అజ్ఞాతవాసమే పట్టిన రోజున మీ దొరగారు, మేమూ, తెలీకుండానే నువ్వు ఈ యుద్ధంలో పూర్తిగా ఓడిపోయినా మనుకో. తెలిసీ తెలియని కబుర్లు చెప్పకు?" అని, రోజల్లా శ్రమించి ఉన్న ప్రాణి కావటం వల్ల కునికిపాట్లు పడసాగింది.

***ముద్రణ : ప్రజాబంధు ఉగాది సంచిక, 1945***